సాక్షి
శ్రీకాకుళం
బుధవారం ¦ 20 ¦ డిసెంబర్ ¦ 2023



ఇంద్రపుష్కరిణికి మహర్దశ

అరసవల్లి ఇంద్రపుష్కరిణికి మహర్దశ పట్టింది. ఆధునికీకరణ పనులకు నేడు శంకుస్థాపన చేయనున్నారు. - 8లో



సాంకేతిక విప్లవానికి నాంది


విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీకి ప్రభుత్వం సిద్ధమైంది. ట్యాబ్‌లు మండల కేంద్రాలకు చేరుకున్నాయి. - 8లో

నేడు జిల్లాకు ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ రాక

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024లో భాగంగా బుధవారం ఉన్నత విద్య, రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ జె.శ్యామల రావు జిల్లాకు రానున్నారని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం కానున్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎలాంటి అనుమానాలు, అభ్యంతరాలు ఉన్నా తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

సీఎం పుట్టిన రోజు వేడుకలు విజయవంతం చేయాలి



ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా నెల 21న జిల్లా వ్యాప్తంగా సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులన్నీ సీఎం జన్మదిన వేడుకల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులకు ఆటల పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించాలని సూచించారు . అలాగే రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరాలు చేపట్టాలని కోరారు. అనాథ, వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సీఎం జన్మదిన వేడుకలు చేపట్టనున్నామని, 10 గంటలకు అందరూ చేరుకోవాలని కోరారు.

సుడా చైర్మన్‌గా ఆశాలత కొనసాగింపు



ఆశాలత గుప్త

నరసన్నపేట: శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా కోరాడ ఆశాలత గుప్తను కొనసాగిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. 2021వ సంవత్సరం ఆగస్టు 12 న మొదటి సారి ఆశాలత గుప్తను చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. రెండేళ్ల పదవీ కాలం పూర్తి కావడంతో మళ్లీ ఆమెనే కొనసాగించారు. సుడా చైర్మన్‌గా మళ్లీ అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

కాలేజీ విద్యార్థులకు పోటీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న ప్రభుత్వ డిగ్రీ కళాశాల పురుషుల శ్రీకాకుళంలో ఉదయం పది గంటలకు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 9491616319 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని వినతి



మంత్రిని కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం రూరల్: ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని కోరుతూ పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి ధర్మాన ప్రసాదరావును బా ర్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి మంగళవారం వినతి పత్రం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు అధ్యక్షతన మంత్రిని కలిసి సమస్యలు వివరించారు. జీఓను పరిశీలించి చట్టసవరణకు ప్రయత్నిద్దామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు పొన్నాడ రాము, గేదెల వాసు, సనపల హరి, పొన్నాడ వెంకటరమణ, ఎం.కృష్ణంరాజు ఉన్నారు.

ఐటెప్ కోర్సుల్లో 22న స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నూతనంగా ప్రారంభించిన నాలుగేళ్ల డిగ్రీ కోర్సు ఇంటిగ్రేటెడ్ టీచర్స్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంలో మిగులు సీట్లకు ఈ నెల 22న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు అడ్మిషన్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్ చెప్పారు. వర్సిటీలో ఆయన మంగళవారం వివరాలు వెల్లడించారు. బీఏ+బీఎడ్ (హిస్టరీ, ఎకనామిక్స్, పాలిటిక్స్), బీఎస్సీ+బీఎడ్ (మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ) డిగ్రీల్లో ఈ ప్రవేశాలు ఉంటాయని అన్నారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించి, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నేషనల్ కౌన్సెల్ ఎడ్యుకేషన్ టెస్ట్ -2023లో అర్హత సాధించి ఉండాలని అన్నారు. 22వ తేదీన ఉదయం నుంచి సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరించి, అనంతరం అర్హత ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని అన్నారు. ఏడాదికి ఫీజు స్ట్రక్చర్ రూ. 18,000 కాగా, స్పాట్ అడ్మిషన్లకు జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన వర్తించవని స్పష్టం చేశారు.

కొనుగోల్ దాటాల్సిందే..!



రైతులకు ఇబ్బంది లేకుండా..



ఈ ఏడాది ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఆధ్వర్యంలో నిరంతర పర్యవేక్షణతో పాటు రైతులకు పూర్తిన్యాయం జరిగేలా కల్లంలో ధాన్యం సేకరణ నుంచి నగదు చెల్లింపుల వరకు అన్ని స్థాయిల్లో పారదర్శకంగా కొనుగోలు చేస్తున్నాం.

– కె.శ్రీనివాస్, జిల్లా మేనేజర్, సివిల్ సప్లయి కార్పొరేషన్, శ్రీకాకుళం

- జిల్లాలో పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలుకు చర్యలు
- మొత్తం 626 ఆర్‌బీకేల్లో కొనుగోలుకు ఏర్పాట్లు
- వారం రోజుల్లో ధాన్యం డబ్బులు చెల్లింపు


శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈ ఏడాది లక్ష్యానికి మించి ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఖరీఫ్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కళ్లం నుంచి ధాన్యం రవాణా, మద్దతు ధర చెల్లింపు, సకాలంలో నగదును వారి ఖాతాల్లో జమ చేసేందుకు కావాల్సిన చర్యలు తీసుకుంటోంది. ఈ ఏడాది జిల్లాలో 260 మిల్లులకు ధాన్యం అందజేస్తున్నారు. దీనికి సంబంధించి 11 మిల్లులు మినహా అన్ని మిల్లులు సార్టెక్స్ పోర్టిఫైడ్ అర్హత కలిగినవే. దీంతో ఎప్పుడు సేకరించిన ధాన్యంను అప్పుడే మిల్లులకు తరలించేందుకు సన్నద్ధం చేశారు.

ఈ ఏడాది వరినాట్లు తక్కువగా పడ్డాయి. ఈ ఖరీఫ్‌లో దాదాపు 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధమైంది. డిసెంబర్‌లో మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కొన్ని చోట్ల పంట తడిచింది. ఆ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని ప్రభుత్వం చెప్పడంతో వాటిని కూడా కొనుగోలు చేస్తున్నారు. రైతులు వారి పరిధిలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయిస్తున్నారు. వారికి వారం రోజుల్లోనే బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. దీని కోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను తయారు చేసింది. దీని ద్వారా ధాన్యం కొనుగోలు తర్వాత ఆన్‌లైన్‌లో బిల్లు జనరేట్ అయిన వారం రోజుల్లో రైతుల వ్యక్తిగత ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారు. ఇప్పటికే రైతులకు రూ.42 కోట్ల మేర ధాన్యం నగదు చెల్లించారు.

రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం సంచులను సిద్ధంగా ఉంచారు. ఒక వేళ రైతులు ఆ గోనెలను ఏర్పాటు చేసుకుంటే వాటికి రైతుకు గోను ఒకటి (80కిలోలు)కి రూ.రూ.6.78 ఇచ్చేస్తున్నారు. అలాగే కళ్లంలో ధాన్యం బస్తాలు ఎత్తడానికి ప్రభుత్వం కూలీలను ఏర్పాటు చేస్తోంది. వారు అందుబాటులో లేకపోతే రైతులే ఆ పనులు చేసుకుంటే ఆ డబ్బులు కూడా ఒక క్వింటాకు రూ.17.17 చెల్లిస్తోంది. దీని వల్ల దళారీల బెడద తగ్గింది. రవాణా చార్జీలు కూడా పూర్తిగా ఈ ఏడాది ప్రభుత్వమే భరిస్తోంది. ఒక వేళ రవాణాకు రైతులు వాహనాలు ఏర్పాటు చేసుకుంటే రవాణా చార్జీలు కూడా దూరాన్ని బట్టి చెల్లిస్తారు.

కొనుగోళ్లు ప్రారంభం

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ధాన్యంను 626 రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టారు. వీటిలో ఇప్పటికే 226 కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే సుమారుగా 30,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. వీటిని 5,532 మంది రైతులు విక్రయించారు. వారికి రూ.60.92 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటికే వీరికి రూ.42.07 కోట్లను వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ధాన్యం విక్రయాల్లో ఎవరికైనా ఇబ్బందులు ఉంటే ఫిర్యాదు చేసేందుకు కంట్రోల్ రూమ్‌లు నిర్వహిస్తున్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1902, 15525ను సంప్రదించాలని అధికారులు తెలిపారు. జిల్లాలో జాయింట్ కలెక్టర్ ధాన్యం కొనుగోలు బాధ్యతలు చూస్తున్నారు. సమస్యలు ఉన్నవారు జేసీని సంప్రదించవచ్చు.



ధాన్యం ధర	రకం	క్వింటా	80 కిలోలు
	సాధారణ రకం	రూ.2183లు	రూ.1746.40లు
	ఏ గ్రేడ్ రకం	రూ.2203లు	రూ.1762.40లు

‘అన్ని అంగన్‌వాడీలు తెరవాలి’



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: గర్భిణులు, బాలింతలు, శిశు రక్షణకు మానవత్వంతో అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. అంగన్‌వాడీల సమ్మె కారణంగా అంగన్‌వాడీ కేంద్రాలు మూసివేస్తే కుదరదని, వందశాతం అంగన్‌వాడీలు తెరవాలని ఆయన తెలిపారు. అన్ని మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సీడీపీఓలతో మంగళవారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. శుక్రవారం నుంచి జిల్లాలో 3358 అంగన్‌వాడీ కేంద్రాలకు గాను 58 శాతం కేంద్రాలు మాత్రమే తెరుచుకున్నాయని, రాష్ట్ర సగటులో ఇది చాలా తక్కువని, బుధవారం నాటికి వంద శాతం కేంద్రాలు తెరుచుకునేలా సంబంధిత యంత్రాంగం పనిచేయాలని స్పష్టం చేశారు. నందిగాం మండలంలో ఒక కేంద్రం కూడా తెరుచుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రణస్థలం, జి.సిగడాం, లావేరు, గార మండలాలలో వంద శాతం కేంద్రాలను ప్రారంభించిన యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. రాజీ మార్గంలో మాట్లాడి కేంద్రాలు తెరుచుకునేలా ప్రయత్నించాలని, కానిపక్షంలో బలవంతంగానైనా తాళాలు తెరవాల్సిందేనని, వీఆర్వోల సమక్షంలో పంచనామా నిర్వహించాలని సూచించారు. ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం సీడీపీఓల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఇచ్ఛాపురం చేరుకున్న ‘ప్రజా చైతన్య యాత్ర’



విజయ స్థూపం వద్ద ప్రజా చైతన్యయాత్ర ద్వారా ప్రచారం చేస్తున్న కావూరి జయకుమార్

ఇచ్ఛాపురం రూరల్: అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ అధికారం దక్కించుకోవాలని కోరుతూ ఓ అభిమాని చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర ఇచ్ఛాపురం చేరుకుంది. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుముడి గ్రామానికి చెందిన కావూరి జయకుమార్ సెప్టెంబర్ 12న ఇడుపులపాయలో ప్రారంభించిన ప్రజా చైతన్య యాత్ర 26 జిల్లాల్లో పర్యటిస్తూ 99వ రోజు మంగళవారం లొద్దపుట్టి విజయ స్థూపం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో అంబేడ్కర్ ఆశించిన పాలన జరుగుతోందని, రెండో సారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవి చేపడితే బడుగు, బలహీన వర్గాల భవిష్యత్‌కు భరోసా దొరుకుతుందన్న ఉద్దేశంతో ప్రజలను చైతన్యపరుస్తూ యాత్ర చేశానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పైలాన్ వద్ద స్థానికులను కలసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని కోరారు.

ఏపీపీఎస్సీ పరీక్షల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బీసీ స్టడీ సర్కిల్‌లో ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షల శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ సంక్షేమ అధికారి ఇ.అనురాధ ఓ ప్రకటనలో తెలిపారు. అర్హతలు కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 18వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారాలు బీసీ స్టడీ సర్కిల్, వాంబే కాలనీ, 80 ఫీట్ రోడ్, టీడీపీ భవనం వెనుక, శ్రీకాకుళంలో గల కార్యాలయంలో లభిస్తాయని పేర్కొన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టి.సి.), కుల ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని సూచించారు. వివరాలకు 8332852106, 7382975679 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రుణాలు మంజూరు చేయాలి: కలెక్టర్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలోని రైతులు, మహిళలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన బ్యాంకర్లతో 2023-24 ద్వితీయ త్రైమాసిక జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సెప్టెంబరు నాటికి రైతులు, కౌలు రైతులకు రుణాలు మంజూరులో లక్ష్యాలు చేరుకోకపోవడం శోచనీయమన్నారు. రైతులకు రుణాలు ఆపవద్దని బ్యాంకర్లను ఆదేశించడమే కాక బ్యాంకుల వారీగా ఉన్న లక్ష్యాలను తెలియజేయాలని సంబంధిత జిల్లా అధికారులు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజరును ఆదేశించి కౌలు రైతులకు రుణాలు అందేలా చూడాలన్నారు. ఎంఎస్ఎంఈలో లక్ష్యాలు, టిడ్కో, విద్యా రుణాలు తదితర అంశాలపై ఆరా తీశారు.జగనన్న సంపూర్ణ గృహ హక్కు పత్రం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతో రుణాలకు వస్తే రుణాలు మంజూరు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రచారం చేస్తున్న వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ జేడీ కిశోర్‌కుమార్ మాట్లాడుతూ బ్యాంకర్లు రుణాలు త్వరగా మంజూరు చేయడం లేదని చెప్పగా సంబంధిత బ్యాంకు అధికారి మాట్లాడుతూ కొంతమంది రైతులు రుణాలు తిరిగి చెల్లించడం లేదని తదితర సమస్యలను కలెక్టర్‌కు వివరించారు.

ప్రభుత్వ ఉద్యోగం పేరిట టోపీ

శ్రీకాకుళం క్రైమ్ : ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని ఓ యువతిని ఇద్దరు వ్యక్తులు నమ్మించి రూ. 4.50 లక్షలకు టోపీ వేశారు. శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె.లక్ష్మి తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని గారవీధికి చెందిన సారిపల్లి హేమలతకు చేపలవీధికి చెందిన సిరిసాన నారాయణ, ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటకు చెందిన బి.వెంకటరమణ అనే ఇద్దరు వ్యక్తులు 2021లో తన తండ్రి ద్వారా పరిచయమయ్యారు. స్వచ్ఛభారత్ అనే సంస్థలో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని, రూ.4.50 లక్షలు ఇస్తే చాలని చెప్పగా హేమలత, ఆమె తండ్రి నమ్మారు. 2021 జులైలో రూ.1,82,500లు బాగాన వెంకటరమణ, అతని మేనల్లుడు పైడి రాజేష్, రాజేష్ సోదరుడు నారాయణలు అకౌంట్ ద్వారా తీసుకున్నారు. మళ్లీ ఆగస్టులో రూ.2,67,500 నగదు రూపేణా వెంకటరమణ, నారాయణలు హేమలత ఇంటికి వచ్చి తీసుకున్నారు. అనంతరం హేమలతను వారు ఎచ్చెర్ల మండలానికి తీసుకువెళ్లి స్మార్ట్ యోజన సొసైటీలో చేర్చారు. కొద్ది రోజులు గడిచాక అది ప్రభుత్వ ఉద్యోగం కాదని తెలిసి, తమ డబ్బులు తమకు ఇవ్వాలని హేమలత, ఆమె తండ్రి అడిగారు. దానికి వారు ఆరు నెలలు ఆగండి.. ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని మళ్లీ నమ్మబలికారు. ఇప్పటివరకు ఉద్యోగం ఊసే లేకపోగా తిరిగి బెదిరిస్తుండడంతో రెండో పట్టణ పోలీసులను మంగళవారం ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

గర్భస్థ లింగ నిర్ధారణ నేరం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, ఫలితాలు వెల్లడించడం నేరమని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం గర్భస్థ పూర్వ, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ సలహా మండలి సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ సలహా మండలి సమావేశాలు డివిజన్ స్థాయిలో నిర్వహించాలన్నా రు. తక్కువ జనాలు ఉన్న మండలాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. ఒక 3 నెలల కాలపరిధిలో రిజిస్ట్రేషన్, అబార్షన్, డెలివరీలు పరిశీలించి కారణాలు పరిశీలించాలని తెలిపారు. స్కానింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లింగ నిర్ధారణ చట్టంపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. బాల బాలికలు ఇద్దరూ సమానమేనని ప్రతి ఒక్కరూ గ్రహించాలని చె ప్పా రు. డీఎంహెచ్ఓ డాక్టర్ బి.మీనాక్షి మాట్లాడుతూ బాలికల జననాలు తగ్గుతున్నాయని తెలిపారు. జిల్లాలో 107 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని, వా టిని సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తామన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ ప్రతి గర్భిణికి అంగన్‌వాడీలతో అవగాహ న కల్పించాలని సూచించారు. సమావేశంలో ఏఎ స్పీ తిప్పేస్వామి, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్ నాయక్, డిఐఓ ఈశ్వరీ దేవి, లీగల్ ఎక్సైజ్ డి.సర ళ కుమారి, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకట రమణ, డిప్యూటీ డెమో వెంకటేశ్వర రావు, పీసీపీఎన్‌డీటీ కోఆర్డినేటర్ సూర్యకళ పాల్గొన్నారు.

‘జగనన్న గోరుముద్ద భేష్’



శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పేరిట ప్రభుత్వ బడుల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం ఎంతో బాగుందని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.జ్ఞాన సువర్ణరాజు పేర్కొన్నారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం శాశ్వత లోక్ అదాలత్‌పై అవగాహన కార్యక్రమానికి హాజరైన సువర్ణరాజు మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.వాగ్దేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణదాత



పొట్నూరు రాజేశ్వరరావు

- నాల్గోసారి అవయవదానానికి వేదికగా జెమ్స్ ఆస్పత్రి
- బ్రెయిన్ డెడ్ వ్యక్తి నుంచి అవయవాల సేకరణ
- ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా గుండె తరలింపు
- ఘనంగా నివాళులర్పించిన ఆస్పత్రి యాజమాన్యం

స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు



అవయవదానానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. ఇదే ఏడాది ఏప్రిల్‌లో మృతిచెందిన విద్యార్థి కిరణ్‌చంద్‌తో మొదలైన అవయవదానం ప్రక్రియపై అందరికీ అవగాహన కలిగింది. నవంబర్ 26న వీఆర్వో బి.మౌనిక రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్‌కు గురైంది. ఆమె కుటుంబ సభ్యులు అవయవదానానికి అంగీకరించారు. డిసెంబర్ 13న పి.వెంకట్‌నాయుడు, డిసెంబర్ 19న పొట్నూరు రాజేశ్వరావులు బ్రెయిన్‌డెడ్‌కు గురి కావడంతో వారి కుటుంబ సభ్యుల అంగీకారంతో వారి అవయవాలు మరో నలుగురికి అమర్చి బతికించారు.

– డాక్టర్ సుధీర్, జెమ్స్

శ్రీకాకుళం రూరల్: సమాజంలో వస్తున్న కీలకమైన మార్పులకు జిల్లా సాక్ష్యంగా నిలుస్తోంది. ఒకప్పుడు అవయవదానంపై ఊరూరా తిరిగి అవగాహన కల్పించినా ఎవరూ ముందుకు వచ్చేవారు కారు. కానీ ఇప్పుడు స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. కిరణ్‌చంద్ అనే విద్యార్థితో మొదలైన ఈ ప్రాణదాన క్రతువు ఇప్పుడు పొట్నూరు రాజేశ్వరరావు వరకు దిగ్విజయంగా సాగింది. రాగోలు జెమ్స్ ఆస్పత్రి మరోమారు అవయవదాన కార్యక్రమానికి వేదికగా నిలిచింది. అనారోగ్యంతో బాధ పడుతూ బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించిన పొట్నూరు రాజేశ్వరరావు(52) అనే వ్యక్తి నుంచి మంగళవారం అవయవాలు సేకరించి అత్యవసర స్థితిలో ఉన్న వారికి ఆగమేఘాలపై అందజేశారు. పూర్తి వివరాల్లోకి వెళితే..

టెక్కలి మండలం రావివలస గ్రామానికి చెందిన పొట్నూరు రాజేశ్వరరావు (52) కిరాణా వ్యాపారం చేస్తుండేవారు. కొద్ది రోజుల కిందట ఈయనకు బీపీ ఎక్కువై కళ్లు తిరగడం ప్రారంభమైంది. దీంతో ఆయనను జెమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. అయితే ఆస్పత్రిలో చేరిన కొన్నాళ్లకు ఆయనకు బ్రెయిన్ డెడ్ అయిపోయింది. ఆపరేషన్ చేసినా ఫలితం ఉండదని, మెదడులో నరాలు చిట్లిపోయి రక్తస్రావమవుతోందని వైద్యులు ధ్రువీకరించారు. ఈ నేపథ్యంలో జీవన్‌దాన్ ప్రతినిధులు, వైద్యులు అవయవదానం గురించి రాజేశ్వరరావు కుటుంబ సభ్యులకు వివరించారు. అంత విషాదంలోనూ కుటుంబ సభ్యులు రాజేశ్వరరావు అవయవాలు దానం చేయడానికి ఒప్పుకున్నారు. దీంతో అవయవాలను తరలించే ప్రక్రియకు మంగళవారం శ్రీకారం చుట్టారు.

ఆగమేఘాలపై..

అవయవదానం గురించి తెలుసుకున్న సీఎం క్యాంపు కార్యాలయం సిబ్బంది శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయాన్ని, ఎస్పీ కార్యాలయాన్ని సంప్రదించారు. గుండెను తిరుపతిలోని స్విమ్స్‌కు అత్యంత వేగంగా తరలించేందుకు హెలీకాప్టర్ ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమయ్యారు. దీనికి సంబంధించి శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు హెలీకాప్టర్ ల్యాండింగ్ స్థలాన్ని పరిశీలించి అంతా సిద్ధం చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు విజయవాడ నుంచి వచ్చిన హెలీకాప్టర్ జెమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో ల్యాండ్ అయ్యింది. అప్పటికే గుండె తరలింపు కోసం అన్నీ సిద్ధం చేసిన ఆస్పత్రి సిబ్బంది గుండెను ఫ్రీజర్‌లో భద్రపరిచి హెలీకాప్టర్ ఎక్కించారు. 3.45 ఇక్కడ నుంచి హెలీకాప్టర్ తిరుపతి బయల్దేరింది. గుండెను తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రికి తరలించగా, లివర్‌ను విశాఖపట్నంలోని పినాకిల్‌కు ఆంబులెన్స్ ద్వారా తరలించారు. కళ్లను రెడ్‌క్రాస్‌కు అందజేశారు. అవయవదానం సందర్భంగా రాజేశ్వరరావు పార్థివ దేహానికి జెమ్స్ సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు.



గుండె ఉన్న ఫ్రీజర్‌ను తీసుకెళ్తున్న వైద్యులు

నలుగురిలో చూసుకుంటాం

తన భర్త రాజేశ్వరరావుకు చెందిన అవయవాలు నలుగురికి ఉపయోగపడితే అదే తమకు సంతృప్తి ఇస్తుందని భార్య నిర్మల అన్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వృత్తిరీత్యా వీరు వ్యాపారం చేస్తున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ సుధీర్, అడిషినల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, క్రిటికల్ కేర్ యూనిట్ వైద్యులు శివన్వేష్, మేనేజర్ బి జోత్స్న, ఆర్ఎంఓలు ప్రవీణ్‌కుమార్, బాలమురళీలు పాల్గొన్నారు.



జీవన్‌దాన్ సంస్థ ద్వారా సర్టిఫికెట్‌ను అందజేస్తున్న దృశ్యం



అవయవాలను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తూ..



గుండె తరలింపు కోసం వచ్చిన హెలికాప్టర్

క్లుప్తంగా

శ్రీకాకుళం డివిజన్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డులు

శ్రీకాకుళం క్రైమ్: జీవిత బీమాకు సంబంధించి రాష్ట్ర వ్యాప్త ఉత్తమ ప్రతిభా పురస్కారాల్లో శ్రీకాకుళం డివిజన్‌కు రెండు ఎక్స్‌లెన్స్ అవార్డులు దక్కాయని డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ పిల్లా శ్రావణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. భారత ప్రభుత్వం-తపాలా శాఖ ఆధ్వర్యంలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమాకు సంబంధించి ఈ అవార్డులు దక్కాయి. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోస్టల్ సర్కిల్, విజయవాడ కేంద్రంగా ఉన్న చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ వారి చేతుల మీదుగా పురస్కారాల ప్రధానం ఉంటుంది. ప్రతిభా పురస్కారాలు దక్కించుకున్న బి.షణ్ముఖరావు, ఇన్‌స్పెక్టర్ పోస్ట్ రూ.90 లక్షల ప్రీమియం, ఎ.శ్రీదేవి, డైరెక్ట్ ఏజెంట్ రూ.40 లక్షల ప్రీమియం సేకరించినందుకుగాను అభినందించనున్నట్లు ఆయన తెలిపారు.

'దత్తత ఉత్తర్వులు పొందడం సులభమే'

శ్రీకాకుళం క్రైమ్ : రక్త సంబంధీకుల దత్తత ఉత్తర్వులను పొందడం సులభతరమని, బాలల న్యాయ చట్టం-2015 సవరణ-2021 ప్రకారం తమ రక్తసంబంధీకుల నుంచి చట్టబద్ధంగా దత్తత తీసుకోవచ్చని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి బి.శాంతిశ్రీ తెలిపారు. ఎవరైనా దత్తత తీసుకోవాలని అనుకుంటే హెచ్‌టీటీపీఎస్:సిఎఆర్ఎ.డబ్ల్యూసిడి.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుంటే వారికి జిల్లా కలెక్టర్ ద్వారా చట్టబద్ధమైన దత్తత ఉత్తర్వులు అందుతాయని, దత్తత తీసుకున్న బిడ్డకు సర్వహక్కులు సంక్రమిస్తాయని పీడీ పేర్కొన్నారు. లావేరు మండలం గురుగుబెల్లి గ్రామానికి చెందిన నేతల జగన్నాథం, నేతల ధనలక్ష్మి దంపతులు తమ రక్త సంబంధీకులైన నేతల తవిటి రాజు, లక్ష్మి దంపతుల కుమార్తెను దత్తత తీసుకునేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం విచారణ చేయగా కేంద్ర దత్తత వనరుల అధికార విభాగం (సీఏఆర్ఏ - న్యూఢిల్లీ) గత నెల 14న అనుమతి ఇచ్చారు. అనంతరం దరఖాస్తును కలెక్టర్ పరిశీలించి దత్తత ఉత్తర్వులు మంజూరు చేశారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు దరహాస్ ఎంపిక


దరహాస్‌ను అభినందిస్తున్న హారికాప్రసాద్, శోభారాణి

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన వేమకోటి ధనుష్య దరహాస్ మరోసారి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. నరసారావుపేట వేదికగా రాష్ట్రస్థాయి జూనియర్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్-2023 పోటీలు ఈనెల 16, 17 తేదీల్లో జరిగాయి. ఈ పోటీల్లో రిలే విభాగంలో రాణించిన దరహాస్ జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు బెంగళూరు వేదికగా జరిగే సౌత్‌జోన్ నేషనల్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు దరహాస్ నేరుగా అర్హత సాధించాడు. ఈ యువ స్విమ్మర్ శ్రీకాకుళం నగరంలోని ఇల్లీసుపురం సమీపంలోని శ్రీచైతన్య జూనియర్ కాలేజ్ ఐఐటీ క్యాంపస్‌లో ఇంటర్ సెకెండియర్ చదువుతున్నాడు. ఫస్టియర్‌లో టాప్ మార్కులు కూడా సాధించి ఆదర్శంగా నిలిచాడు. యువ స్విమ్మర్‌ను స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెఎన్ఎస్‌వీ(హారిక) ప్రసాద్, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం అరసవల్లి అధ్యక్షుడు కరణం శోభారాణి, శ్రీచైతన్య కాలేజ్ ఏజీఎం నర్సునాయుడు, డీన్ మురళీధర్, ప్రిన్సిపాల్ రామకృష్ణ, అంతర్జాతీయ స్విమ్మింగ్ క్రీడాకారుడు ఎస్.కాంతారావు, డీఎస్‌డీఓ కె.శ్రీధర్‌రావు తదితరులు అభినందించారు.

'సాంకేతిక సమస్యలు పరిష్కరించండి'


రావిచెంద్రి వద్ద ఏబీ రోడ్డుపై ఆందోళనకు దిగిన రైతులు, ట్రాక్టర్ డ్రైవర్లు

ఎల్ఎన్ పేట: ధాన్యం కొనుగోలులో జీపీఎస్ విధానం ద్వారా సాంకేతిక పరమైన సమస్యలు, మిల్లర్ల దోపిడీలను అధికారులు పరిష్కరించాలని కోరుతూ ధాన్యం రైతులు, ట్రాక్టర్ డ్రైవర్లు మంగళవారం ఆందోళనకు దిగారు. మండలంలోని రావిచెంద్రి గ్రామం వద్ద అలికాం-బత్తిలి రోడ్డుపై ధాన్యం లోడుతో ఉన్న ట్రాక్టర్లను నిలిపి ట్రాక్టర్ డ్రైవర్లు, రైతులు ఆందోళన చేపట్టారు. జీపీఎస్ సమస్యలు తలెత్తుతుంటే మిల్లలు అదనంగా 5 కిలోల ధాన్యం అదనంగా తీసుకుంటున్నారని అన్నారు. ఆర్‌బీకేల వద్ద పరిశీలించినా మిల్లుల వద్ద కొర్రీలు పెడుతున్నారని అన్నారు. జీపీఎస్ కనెక్ట్ కావడం లేదంటూ ధాన్యం దించకుండా రెండేసి రోజులు మిల్లరు వద్ద ఉంచేస్తున్నారని ట్రాక్టర్ డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను తెలుసుకున్న సివిల్ సప్లయి డీఎం శ్రీనివాసరావు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని ధాన్యం కొనుగోలు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని రైతులకు తెలిపారు.

సాంకేతిక విప్లవానికి నాంది

- వరుసగా రెండో ఏడాది ట్యాబ్‌ల పంపిణీకి సర్కారు శ్రీకారం
- 21న విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేత
- జిల్లాలో 22,318 మంది విద్యార్థులకు లబ్ధి


శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యాప్‌లు ఇన్‌స్టాల్ చేసిన ఒక ట్యాబ్‌ను చూపిస్తున్న అక్కడి ఉపాధ్యాయులు, సిబ్బంది

శ్రీకాకుళం న్యూకాలనీ, ఇచ్ఛాపురం: ప్రభుత్వ పాఠశాలల్లోని 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేయడానికి ప్రభుత్వం సకలం సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన ఈ కానుకను విద్యార్థులకు అందజేయనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 21వ తేదీన విద్యార్థులకు పంపిణీ చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. నెలాఖరు వరకు పంపిణీ కార్యక్రమం కొనసాగుతుంది. విద్యార్థులకు ప్రపంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చారు. అమ్మఒడితో పేదపిల్లలకు బడులకు చేరువ చేయడం, నాడు-నేడుతో పాఠశాలలను తీర్చిదిద్దడం, జగన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద-రాగీమాల్ట్ తో రుచికరమైన, ఆరోగ్యవంతమైన భోజనం, ఇంగ్లిష్ మీడియంలో చదువులు, సిలబస్-కరిక్యూలమ్‌లో సమూలంగా మార్పులు, సీబీఎస్సీ సిలబస్, మిర్రర్ ఇమేజ్ పాఠ్యపుస్తకాలు, డిజిటల్ విద్యను చేరువ చేయడం ఇలా ఎన్నో సంస్కరణలు, మరెన్నో కార్యక్రమాలకు అంకురార్పణ చేశారు.

వరుసగా రెండో ఏడాది ట్యాబ్‌ల అందజేత..

డిజిటల్ విద్యను మరింత చేరువ చేసే విద్యా సంస్కరణల్లో భాగంగా ట్యాబ్‌ల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాదే శ్రీకారం చుట్టింది. గత ఏడాది విద్యార్థులు, ఉపాధ్యాయులకు కలిపి 25,953 ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఇందులో విద్యార్థులు 22,982 మంది, ఉపాధ్యాయులు 2971 మంది ఉన్నారు. రెండో ఏడాది 22,318 మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేసేందుకు అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 22,318 మంది విద్యార్థులకు శాంసంగ్ కంపెనీ తయారుచేసిన నాణ్యమైన ట్యాబ్‌లను పంపిణీ చేయనున్నారు.

మొదటి విడతలో ప్రభుత్వం నుంచి 10,050 ట్యాబ్‌లు ఇప్పటికే జిల్లాకు చేరుకోగా.. వీటిని మండల కేంద్రాలకు చేరవేశారు. అక్కడ నుంచి పాఠశాలలకు చేరవేస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో బైజూస్ కంటెంట్‌తో బోధన చేసేలా ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అలాగే 4, 5, 6, 7, 9, 10వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌ను ప్రభుత్వం ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చింది. బైజూస్‌తో ఒప్పందం కుదుర్చుకున్న ప్రభుత్వం సబ్జెక్టుల వారీగా డిజిటల్ కంటెంట్‌ను ట్యాబ్‌లలో లోడ్ చేసింది. సాంకేతికంగా వినూత్న ఫీచర్లు కలిగిన ట్యాబ్‌లో సిమ్‌కార్డు, ప్రీ లోడెడ్ ఎడ్యుకేషనల్ యాప్స్ ఇందులో ఉన్నాయి. అయితే ఈ ట్యాబ్‌లలో యూట్యూబ్, కెమెరా, ఇతర యాప్‌లు ఓపెన్ కాకుండా ప్రభుత్వం టెక్టోరో అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ సాయంతో చర్యలు తీసుకుంది.

డిజిటల్ విద్య మరింత చేరువ..



విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే డిజిటల్ విద్యను చేరవ చేయాలని సీఎం జగన్ సంకల్పించడం నిజంగా అభినందనీయం. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వరుసగా రెండో ఏడాది నాణ్యమైన ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో 22,318 ట్యాబ్‌లను విద్యార్థులకు అందిస్తాం. తొలి విడతగా 10,050 జిల్లాకు వచ్చాయి. వీటిని మండల కేంద్రాలకు ఇప్పటికే చేర్చాం. అక్కడ నుంచి ఆయా స్కూళ్లకు భద్రంగా చేర్చుతున్నారు. మిగతా ట్యాబ్‌లు కూడా చేరుకుంటున్నాయి.

– డాక్టర్ రోణంకి జయప్రకాష్, సమగ్రశిక్ష ప్రాజెక్ట్ జిల్లా ఏపీసీ శ్రీకాకుళం

ట్యాబ్‌ల పంపిణీకి ఏర్పాట్లు చేశాం



ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం ఆలోచన చేస్తూనే ఉంది. అంతర్జాతీయ స్థాయిలో పోటీని తట్టుకుని నిలబడేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వ బడుల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు శాంసంగ్ ట్యాబ్‌లను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వరుసగా రెండో ఏడాది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని జిల్లాలో ఈనెల 21న ప్రారంభిస్తున్నాం.

– కె.వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి శ్రీకాకుళం


పాఠశాలలకు పంపిణీ చేసేందుకు మండల కేంద్రంలో సిద్ధంగా ఉన్న ట్యాబ్‌లు

ఈ ట్యాబ్‌లను అప్‌డేట్ చేయడానికి ఎంఆర్‌సీ సిబ్బందికి, సీఆర్పీలకు, పాఠశాల హెచ్ఎంలు, యాక్టివ్ టీచర్లు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణను అందిస్తున్నారు.

కొత్త వ్యక్తులపై నిఘా ఉంచాలి: ఎస్పీ


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : రానున్న పండగ రోజుల్లో దొంగతనాలు జరిగే అవకాశం ఉందని, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో కార్డన్ సెర్చ్ నిర్వహించి కొత్త వ్యక్తులపై నిఘా ఉంచాలని ఎస్పీ జీఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం పెండింగ్‌లో ఉన్న కేసులు, నవంబరు నెలలో నమోదైన కేసులపై ఎస్పీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులు, గ్రేవ్ కేసులు దర్యాప్తు వేగంగా పూర్తి చేయాలని, నిందితులపై చార్జిషీటు కోర్టులో దాఖలు చేయాలన్నారు. కొత్త వ్యక్తుల సమాచార సేకరణ, అనుమానిత వ్యక్తులపై నిఘా, లాడ్జీలు, వాహనాలను విస్తృతంగా తనిఖీ చేసి నేర నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నాన్‌బెయిలబుల్ వారెంట్స్ వీలైనంత వరకు అమలుపర్చి న్యాయస్థానంలో హాజరుపర్చాలని, వీలైనంత మేరకు ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, దేవాలయాలు, అపార్ట్‌మెంట్ల వద్ద వాచ్‌మెన్‌లను అప్రమత్తం చేస్తూ గస్తీ తిరగాల్సిన సిబ్బందితో పోలీసు అధికారులు తగిన సూచనలు చేయాలన్నారు. సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీలు టీపీ విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, డీఎస్పీలు డి.బాలచంద్రారెడ్డి, వై.శృతి, నాగేశ్వరరెడ్డి, ట్రైనీ డీఎస్పీ సీహెచ్ రాజా, కె.శ్రీనివాసన్, లీగల్ అడ్వైజర్ వై.యమాని, ఏఓ సీహెచ్ గోపినాధ్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులపై ఉపాధ్యాయులకు శిక్షణ


అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పీడీ శ్రీనివాసరావు

రణస్థలం: బాలికలకు పాఠ్యాంశాలతో పాటు వృత్తి విద్య నైపుణ్యాన్ని పెంపొందించేందుకు మూడు రోజుల ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామని రాష్ట్ర సమగ్రశిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అన్నారు. లంకపేట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో యునిసెఫ్ సమకూర్చిన రూ. 1.50 కోట్ల విలువ గల అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి విద్యా నైపుణ్య కోర్సులకు సంబంధించి ఈ ల్యాబ్‌లో ఒకేషనల్ ఉపాధ్యాయులు సమగ్రంగా తర్ఫీదు పొందాలని సూచించారు. రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లాలోని లావేరు, రణస్థలంలోని కేజీబీవీలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు ఈ ల్యాబ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం లావేరులో ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. తద్వారా బాలికలకు వృత్తి విద్య నైపుణ్యం కలిగిస్తారని చెప్పారు. అనంతరం గ్రంథాలయం, సైన్సు ల్యాబ్‌తో పాటు మధ్యాహ్న భోజనం మెనూ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. టెన్త్, ఇంటర్మీడియెట్ తరగతుల విద్యార్థులకు పంచతంత్ర ప్రణాళికలో భాగంగా 100 రోజుల కార్యక్రమంపై విద్యార్థుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో యునిసెఫ్ ప్రతినిధి టి.సుదర్శన్ రావు, ఏటీఎల్ రామ్‌కో ఎస్ శ్రీనివాసరావు, జిల్లా ఏపీసీ రోణంకి జయప్రకాశ్, జీసీడీఓ నీరజ, ఎంఈవో ఏ త్రినాధరావు, కేజీబీవీ ప్రత్యేకాధికారి ఎస్.హైమవతి తదితరులు ఉన్నారు.

రూ.లక్ష సాయం అందజేత


శోభారాణికి రూ.లక్ష చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: మండలంలోని పాశీగంగుపేట గ్రామానికి చెందిన గంగు శోభారాణి (వైస్ ఎంపీపీ) భర్త గంగు వాసుదేవరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని సీఎం సహాయనిధి నుంచి రూ.లక్ష మంజూరు చేశారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శోభారాణికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి చేతులమీదుగా రూ.లక్ష చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్ సుందరరావు, సచివాలయ మండల కన్వీనర్ సూర్యం, నాయకులు గెదెల సూర్యం, గిరి, ఉమా, జోగారావు,పద్మరాజు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ


లారీ ఢీకొనడంతో పడిపోయిన విద్యుత్ స్తంభం

సారవకోట: మండలంలోని అలుదు పంచాయతీ మాకివలస గ్రామంలో మంగళవారం విద్యుత్ స్తంభాన్ని ఓ లారీ ఢీకొట్టింది. మాకివలస నుంచి మర్రివలస వెళ్లే మార్గంలో మలుపుతో పాటు రోడ్డుకు ఆనుకుని ఆ గ్రామానికి చెందిన నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డి ఉండటంతో లారీ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది.

అయితే ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. స్థానికులు వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించి సరఫరాను నిలుపుదల చేయించారు. అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డి తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సబ్ కలెక్టర్ కారు అడ్డగింత


టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ కారుకు అడ్డంగా కూర్చుని ధర్నాకు దిగిన దృశ్యం

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలం అక్కయ్యవలస సర్పంచ్ సుంకరి జనార్ధన ఆధ్వర్యంలో పలువురు జగనన్న ఇళ్ల లబ్ధిదారులు మంగళవారం టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ కారును అడ్డగించి నిరసనకు దిగారు. తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ తమ విన్నపాలను పట్టించుకోవడం లేదని, టీడీపీ మద్దతుదారులకు సహకరిస్తున్నారని ఆరోపించారు. ఇక్కడ 2019లో అక్కయ్యవలసలో 25 మందికి ఇళ్ల పట్టాలు అందించారు. ఈ మేరకు గ్రామంలోని సర్వే నంబర్ 19లో లే అవుట్ వేశారు. అయితే అప్పటికే అది ఆక్రమిత ప్రాంతం కావడంతో కొందరు ఇల్లు కూడా కట్టుకున్నారు. అక్కడే కొత్తగా పట్టాలు ఇస్తుండడంతో కొందరు టీడీపీ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి నుంచి పట్టాల పంపిణీ నిలిచిపోయింది. అప్పటి నుంచి స్థానికులు అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నా ఫలితం లేకపోయింది. ఇటీవల పలాస పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి సమస్య తీసుకెళ్లడంతో.. సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ విచారణ కోసం అక్కయ్యవలస వెళ్లారు. లే అవుట్‌ను వేరే చోటకు మారుస్తామని చెప్పడంతో ఆగ్రహించిన లబ్ధిదారులు ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ జామి ఈశ్వరమ్మను వివరణ కోరగా లేఅవుట్ నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతోనే పట్టాలు ఇవ్వలేదని, సబ్ కలెక్టర్ ఆదేశాలమేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే నిరసనకారులు ఎంతకూ శాంతించకపోవడంతో పోలీసులు వచ్చి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

'విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

నరసన్నపేట: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చొరవ చూపాలని, ఉద్యోగ సంఘాలతో చర్చలకు రావాలని ఏపీ విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర చైర్మన్ ఎస్.కృష్ణయ్య అన్నారు. నరసన్నపేటలో ఏపీ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్(1104) నూతన కార్యవర్గ సమావేశం మంగళవారం స్థానిక ఒక హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ వినియోగదారుల సంఖ్యకు సమాన ప్రాతిపదికన సిబ్బందిని నియమించడం లేదని ఆరోపించారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీ గోపాలరావు మాట్లాడుతూ ఉద్యోగుల సంఘం పటిష్టతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. జనవరి 6న విజయవాడలో విద్యుత్ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ ఉందని, అదే రోజు మేనేజ్‌మెంట్ దృష్టికి విద్యుత్ ఉద్యోగుల సమస్యలు తీసుకువెళ్తామని అన్నారు. సమావేశం అనంతరం ఎంవీ గోపాలరావుతో పాటు ఇతర కార్యవర్గాన్ని సత్కరించారు.

'మెలకువలపై అవగాహన అవసరం'


డైట్ విద్యార్థుల ల్యాబ్‌ను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష ఎస్‌పీడీ శ్రీనివాసరావు

గార: ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు బోధించడానికి శిక్షణలో మెలకువలు అవసరమని సమగ్రశిక్షా రాష్ట్ర పీడీ బి.శ్రీనివాసరావు అన్నారు. వమరవల్లి ప్రభుత్వ డైట్‌లో ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్లు, స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్లకు శిక్షణ సమావేశం మంగళవారం ప్రారంభమైంది. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో తయారుచేసిన ట్యాబులు, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం డైట్‌లోని టీచ్ కార్నర్, స్టూడెంట్ కార్నర్‌లు పరిశీలించారు. అమెరికన్ ఇండియన్ ఫౌండేషన్ డైట్‌లో ఏర్పాటుచేసిన స్టెమ్ ఇన్నోవేషన్, లెర్నింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.తిరుమల చైతన్య తదితరులు ఉన్నారు.

ఇంద్రపుష్కరిణికి మహర్దశ


ఇంద్ర పుష్కరిణి

అరసవల్లి: ప్రఖ్యాత అరవసల్లి ఆదిత్య క్షేత్రంలోని ఇంద్రపుష్కరిణి ఆధునికీకరణ పనులకు బుధవారం శ్రీకారం చుట్టనున్నారు. ప్రభుత్వం, దేవదాయశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఇంద్రపుష్కరిణి అభివృద్ధి పనులకు ఏకంగా రూ.4 కోట్లు వెచ్చిస్తున్నారు. ఉదయం 9.09 గంటలకు నిర్మాణ పనులకు మంత్రి ధర్మాన ప్రసాదరావు శంకుస్థాపన చేయనున్నారు. సుమారు 3 ఎకరాల్లో సరికొత్త సౌకర్యాలతో అత్యాధునికంగా ఇంద్రపుష్కరిణి త్వరలోనే అందుబాటులోకి రానుంది. రూ.2 కోట్ల కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) నిధులు, స్థానిక ఆలయానికి చెందిన రూ.2 కోట్ల నిధులను కలుపుకుని మొత్తంగా రూ.4 కోట్లతో ఈ నిర్మాణ పనులకు డిజైన్ సిద్ధం చేశారు. ఈ డిజైన్ ప్రకారం కొత్తగా నిర్మించనున్న పుష్కరిణికి నలువైపులా స్నానపు ఘాట్లు ఉండనున్నాయి. అలాగే ప్రమాదాలు జరుగకుండా పుష్కరిణి మధ్యలో పెద్దగా లోతు లేకుండా జాగ్రత్తలు తీసుకోనున్నారు. పుష్కరిణి మధ్యలో గరుత్మంతుని విగ్రహాన్ని, ముందుభాగంలో ఏడు గుర్రాలతో సూర్యదేవుని విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అలాగే ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మతో పాటు దేవదాయ శాఖ స్తపతి సూచనలను పక్కాగా అమలు చేస్తూ ఈ కొత్త నిర్మాణం జరగనుంది. ఈ రూ.4 కోట్ల ప్రాజెక్టు వర్కుకు సంబంధించి ఇటీవలే టెండర్ల ప్రక్రియ పూర్తికాగా ఓ ప్రతిష్టాత్మక ఇంజినీరింగ్ సంస్థకు టెండర్ దక్కింది.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

సరుబుజ్జిలి: కొత్తకోట గ్రామానికి చెందిన కాగితాపల్లి కళావతి మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడును మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి దొంగిలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కళావతి తన కల్లంలో వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి చేరుతున్న సమయంలో గ్రామానికి శివారున ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఎవరో కొందరు ఆమెపై దాడి చేసి పుస్తెలతాడు తెంపుకుని పారిపోయారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కూటికుప్పల కృష్ణప్రసాద్ వెల్లడించారు.

విద్యాసంస్థల్లో జూనియర్ రెడ్‌క్రాస్‌లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ క్లబ్‌ల రిజిస్ట్రేషన్ నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. రెడ్‌క్రాస్ సేవల విస్తరణ, యూత్ క్లబ్‌లు ఏర్పాటు అంశంపై రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ అధిక స్థాయిలో నమోదు చేసిన కళాశాలలకు పాఠశాలలకు ప్రశంసా పత్రాలు అందిస్తామని తెలిపారు. డిసెంబర్‌లోగా నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన్ రావు మాట్లాడుతూ నమోదు వేగంగా చేయాలన్నారు.

మ్యూచువల్ ఫండ్ల అవకతవకలపై ఆరోపణలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో మళ్లీ ఓ బ్యాంకుకు సంబంధించి మ్యూచువల్ ఫండ్ల అవకతవకలపై ప్రజల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గార ఎస్‌బీఐ దారుణం మర్చిపోక ముందే మరో అక్రమం తెరమీదకు వస్తోంది. మ్యూచువల్ నిధులు రూ. 3.20 కోట్ల మేర దారి మళ్లాయని పలువురు బాధితులు వాపోతున్నారు. దీనిపై సంబంధిత అధికారులెవరూ నోరు మెదపకపోవడం గమనార్హం. దీనిపై ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఆర్ఎం రాజును వివరణ కోరగా సంబంధిత మ్యూచువల్ ఫండ్స్ బ్రాంచి తన పరిధిలో రాదని, అక్కడి వారితో ఎలాంటి అధికారిక నియంత్రణ తనకుండదని, తనకు ఫిర్యాదు కూడా రాలేదన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు


ఎస్పీ రాధిక చేతుల మీదుగా సేవా పతకాన్ని అందుకుంటున్న అదనపు ఎస్పీ తిప్పేస్వామి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన పలువురు పోలీసు అధికారులు, సిబ్బందికి గుర్తింపుగా సేవా పతకాలు వరించాయి. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఎస్పీ జీఆర్ రాధిక తన చేతుల మీదుగా సేవా పతకాలను ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం 2023 సంవత్సరానికి గాను మంగళగిరి రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం ద్వారా వచ్చిన ఈ పతకాలు జిల్లా అదనపు ఎస్పీ జె.తిప్పేస్వామి, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ పి.ఢిల్లీరావు, హెడ్ కానిస్టేబుల్ ఎస్.అప్పలరాజు, కానిస్టేబుల్ ఐ.గంగరాజులకు దక్కాయి. ఎస్పీ ప్రత్యేకంగా వీరిని అభినందించారు. 2012 సంవత్సరానికి గాను రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డిస్క్ అవార్డు ఇన్‌స్పెక్టర్ డీవీవీ సతీష్, కుమార్, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎస్.సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుళ్లు బి.బాలసూర్యరాజు, కె.సింహారావు, ఎస్.రాజేష్‌రావు, పి.ఋషికేష్‌లు ఎస్పీ చేతుల మీదుగా అందుకున్నారు.

డీజీపీ ప్రశంసలు

సబ్‌ఇన్‌స్పెక్టర్ పోలీస్ రిక్రూట్‌మెంట్లో ఉత్తమ పనితీరు కనబర్చినందుకు విశాఖపట్నం రేంజి డీఐజీ ఎస్.హరికృష్ణ ప్రశంసించి పంపించిన ప్రశంసా పత్రాలను ఎస్పీ చేతుల మీదుగా పలువురికి అందజేశారు. వీరిలో ఏఓ సీహెచ్ గోపీనాధ్, ట్రాఫిక్ డీఎస్పీ సీహెచ్‌జీవీ ప్రసాద్, సీఐలు వి.బాబ్జీరావు, జి.రవికుమార్, ఎస్ఐలు ఎస్.హరికృష్ణ, ఎం.ప్రవళ్లిక, కె.లావణ్య, బి.రేణుక, కె.వరప్రసాద్, జి.రవికుమార్, కార్యాలయం సిబ్బంది ఎల్.బాలరాజు, ఎం.శ్రీధర్, ఎం.వాసునాయుడు, జె.బాలకృష్ణ, పి.శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్‌నాయుడు, కె.సుమన్, పి.సురేష్‌లు ఉన్నారు.

ఎస్పీ ప్రశంసలు

జిల్లాలోని పలు కేసుల పరిష్కారం, సీసీ కెమెరాల ఏర్పాటు, రోడ్డు ప్రమాదాల నివారణా చర్యలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు అను పలు అంశాలపై దృష్టి సారించి ఉత్తమ పనితీరును కనబర్చిన పోలీసు అధికారులకు ఎస్పీ ప్రత్యేక ప్రశంసాపత్రాలు అందించారు. వీరిలో సీఐలు డి.నవీన్‌కుమార్, అమీర్ ఆలీ, మహ్మద్, బాలరాజు, పి.శ్రీనివాసరావు, బి.గణేష్, ఎ.విజయ్‌కుమార్, వి.సత్యనారాయణ, బి.అశోక్‌కుమార్, జి.రాజేష్, ఏ.కోటేశ్వరరావులు ఉన్నారు.